సాక్షి తిరుపతి

సోమవారం । 22 । జూలై । 2024



పట్టా చేతికొచ్చిన సంబరం

తిరుపతి ఐఐటీ స్నాతకోత్సవం సందర్భంగా ఇంజినీరింగ్ పట్టా పుచ్చుకున్న విద్యార్థులు సంబరాల్లో మునిగితేలారు. - 8లో



వైభవం.. అగ్నిగుండ ప్రవేశం

శ్రీకాళహస్తిలోని ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం అగ్నిగుండ ప్రవేశం వైభవంగా నిర్వహించారు. - 8లో



వస్త్ర దుకాణం ధ్వంసం

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుకు చెందిన వస్త్ర దుకాణంపై టీడీపీ అల్లరి మూకలు దాడులు చేసి, ధ్వంసం చేశాయి. - 8లో

న్యూస్‌రీల్

గరుడోత్సాహం



తిరుమల: తిరుమలలో ఆదివారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని గరుడ సేవ అత్యంత వైభవంగా సాగింది. సర్వాలంకారభూషితుడైన మలయప్ప తనకిష్టమైన గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి స్వామివారిని దర్శించి పునీతులయ్యారు.

నేడు గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ చేపట్టనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నారు. అన్ని విభాగాలకు చెందిన అధికారులు గ్రీవెన్స్‌కు హాజరుకానున్నారు. ప్రతి జిల్లా అధికారి హాజరు కావాలని ఇప్పటికే కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 83,538 మంది స్వామిని దర్శించుకున్నారు. 30,267 మంది తలనీలాలు సమర్పించారు. భక్తులు స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.4.25 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఎల్‌ఎల్‌బీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన ఎల్‌ఎల్‌బీ కోర్సుకు సంబంధించిన మూడు, ఏడవ సెమిస్టర్ ఫలితాలు ఆదివారం విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

55 మంది ఎంపిక

సూళ్లూరుపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జేకేసీ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఫాక్స్‌కాన్ ఇంటర్ కనెక్ట్ టెక్నాలజీ కంపెనీరు ఆదివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు జేకేసీ ఇన్‌చార్జి కో–ఆర్డినేటర్ సీహెచ్ సుబ్రమణ్యం శాస్త్రి అధ్యక్షత వహించారు. ఫాక్స్‌కాన్ ఇంటర్ కనెక్ట్ టెక్నాలజీ హెచ్ ఆర్ మురళీధరన్ కంపెనీ ప్రగతి గురించి వివరించారు. ఈ జాబ్‌మేళాకు 150 మంది హాజరుకాగా వారికి మౌఖిక పరీక్షలను నిర్వహించారు. వీరిలో 55 మందిని వివిధ రకాల ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సిబ్బంది అభినందించారు.



రేణిగుంటలో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న దృశ్యం(ఫైల్)

ఆగని విధ్వంసం

- రాజకీయ కక్షతో టీడీపీ విధ్వంస రచన
- కుప్పకూలుతున్న ప్రతిపక్ష నేతల ఆస్తులు
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల దుకాణాలు ధ్వంసం
- పోలీసుల కళ్లెదుటే టీడీపీ మూకల దాడులు
- అయినా బాధితులపైనే నమోదవుతున్న కేసులు
- 40 రోజులైనా ఆగని అరాచకాలు

సాక్షి నెట్‌వర్క్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుపతిలో చోటుచేసుకున్న సంఘటనలు అమానుషంగా ఉన్నాయి. కొర్లగుంటలోని వైఎస్సార్‌సీపీ నేత శ్రీదేవి ఇంటిపై కొందరు వ్యక్తులు 20 రోజుల క్రితం మాస్కులు ధరించి రాళ్లతో దాడి చేశారు. తిరుపతిలోని 26వ డివిజన్ పరిధిలోని నవాబ్‌పేటలో కార్పొరేటర్ తాజిన్ భర్త ఉదయవంశీ కార్యాలయంపై టీడీపీ నేతలు రాళ్ల వర్షం కురిపించారు. ఆయన కార్యాలయంలోని విలువైన ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. 8వ డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీ కాలనీలో డివిజన్ అధ్యక్షుడు మురళి పార్టీ కార్యాలయంపై టీడీపీ నేతలు దాడులకు తెగబడ్డారు. దీంతో సుమారు రూ.2లక్షల ఫర్నిచర్ ధ్వంసమైంది. జీవకోన సత్యనారాయణపురంలో పలు అభివృద్ధి పనుల కోసం భూమన కరుణాకరరెడ్డి పేరుతో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేశారు. ఇంటింటికీ రేషన్ సరుకులు అందిస్తున్న వాహనాలను ధ్వంసం చేశారు. రెండు రోజుల క్రితం(ఈనెల 18వ తేదీ) తిరుపతి నగరంలోని రాయల్ నగర్‌లో వృద్ధురాలు జయలక్ష్మిని దారుణంగా హత్య చేశారు. వారి కుటుంబ సభ్యులపై కత్తులతో దాడులకు తెగబడ్డారు. మొత్తంగా తిరుపతి నగరంలో ఏ క్షణంలో ఎవరు దాడులు చేస్తారో అన్న ఆందోళనలో తిరుపతి వాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

అధికారం వచ్చిందనగానే టీడీపీ మూకలు విధ్వంసానికి దిగాయి. ప్రతిపక్ష నాయకుల ప్రాణాలు తీయడమే లక్ష్యంగా దాడులు చేస్తున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆస్తులు, వాహనాలు, వ్యాపారాలను ఎక్కడికక్కడే నాశనం చేస్తున్నాయి. పోలీసు వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకుని టీడీపీ నేతలు ఈ అరాచకాలు సృష్టిస్తున్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచిన వారిపై పగబట్టి హింసిస్తున్నారు. నెల రోజులు గడుస్తున్నా పరిపాలనపై దృష్టి పెట్టకుండా, కక్ష సాధింపులే పరమావధిగా వ్యవహరిస్తున్నారు. మద్యం తాగి కొందరు మాస్కులు ధరించి మరికొందరు దాడులకు తెగబడుతున్నారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి నగరంలో శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్నారు.

పాకాల మండలంలో..

- జూన్ 4న రమణయ్యగారిపల్లి దళిత సర్పంచ్ యువరాజు ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి కుర్చీలు, ఫ్యాన్లు, గృహోపకరణాలను ధ్వంసం చేశారు. అడ్డొచ్చిన సర్పంచ్‌పై దాడికి పాల్పడ్డారు.
- జూన్ 7న పాకాల పట్టణంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు సతీష్ కుమార్‌కు చెందిన పూల దుకాణాన్ని ధ్వంసం చేశారు. ఆ కుటుంబానికి జీవనోపాధి లేకుండా చేశారు.
- జూన్ 29 న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు యుగంధర్(చంటి)పై టీడీపీ నాయకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

అట్టుడుకుతున్న చంద్రగిరి



సప్తగిరి నగర్ పంచాయతీ ఉప సర్పంచ్ అశోక్ కారును ధ్వంసం చేస్తున్న టీడీపీ శ్రేణులు



చంద్రగిరి: ఏ.రంగంపేటలో ధ్వంసమైన పార్టీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి



పాకాల: టీడీపీ శ్రేణులు ధ్వంసం చేసిన పూల దుకాణం

సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం చంద్రగిరిలోనూ నారాసుర రక్తపాతం కొనసాగుతోంది. ముసుగులు ధరించి వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు పాల్పడడంతోపాటు వాహనాలు, ఆస్తులను ధ్వంసం చేయడం పరిపాటిగా మారింది. వైఎస్సార్‌సీపీ శ్రేణుల వ్యాపారాలపైన, ఆర్థిక మూలాలపై కూడా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.

- చంద్రగిరి మండలంలో గత నెల 5న చంద్రగిరికి చెందిన పంచాయతీ వార్డు సభ్యుడు సక్కూరు వంశీపై టీడీపీ మూకలు ఐతేపల్లెలోని తన దాబా వద్ద పోలీసుల సమక్షంలో దాడి చేసి గాయపరిచారు. ఆపై దాబాను ధ్వంసం చేసి తీవ్రంగా నష్టపరిచారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు మాత్రం శూన్యం.
- గత నెల 6న చంద్రగిరి కొత్తపేటకు చెందిన అంగేరి రాజశేఖర్ ఓ దుకాణం వద్ద ఉండగా టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు 7న చంద్రగిరి మండల పార్టీ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌తో కలిసి పోలీసు స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడికి భారీగా చేరుకున్న టీడీపీ నేతలు పోలీసుల సాక్షిగా షేక్ మస్తాన్‌పై దాడికి పూనుకున్నారు.
- గత నెల 7వ తేదీన ఏ.రంగంపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. ఏసీ, టీవీ, రిఫ్రిజిరేటర్, ఫర్నిచర్‌ను సైతం ధ్వంసం చేసి రాక్షసానందరం పొందారు.
- ఈ నెల 11న శేషాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వినోద్ తిరుపతి నుంచి తన స్వగ్రామానికి వెళ్లిన సంగతి తెలుసుకుని, టీడీపీ నాయకులు దళిత వాడకు చేరుకుని దాడికి పాల్పడ్డారు.
- ఈ నెల 14న అనంతగుర్రప్పగారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మేడసాని ప్రవీణ్, తిరుపతి–పీలేరు జాతీయ రహదారి రామిరెడ్డిపల్లి వద్ద నిర్వహిస్తున్న దాబాను అర్ధరాత్రి టీడీపీ నాయకులు ముసుగులు ధరించి జేసీబీతో కూల్చివేశారు. సాక్ష్యాలు దొరక్కుండా ఉండేందుకు దాబా హౌస్‌లో ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజ్ హార్డ్ డిస్క్‌ను సైతం అపహరించారు.



టీడీపీ మూకల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు నక్కూరు వంశీ, యుగంధర్, హరి, లక్ష్మీనారాయణ, ఇర్షద్

చిన్నగొట్టిగల్లు మండలంలో..

- జూన్ 5న చిట్టేచర్ల పంచాయతీకి చెందిన వంశీ ఇంటిపై అర్ధరాత్రి దాడులకు తెగబడ్డారు.
- జూన్ 8న చిన్నగొట్టిగల్లు వార్డు సభ్యుడు ఇర్షాద్‌పై ముసుగులు ధరించిన టీడీపీ నాయకులు మారణాయుధాలతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు.
- రామచంద్రాపురం మండలం పరమాల హరిజనవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హరిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జూన్ 6న దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.



తిరుపతి: టీడీపీ గూండాలు ధ్వంసం చేసిన వైఎస్సార్‌సీపీ కార్యాలయం



శ్రీదేవి ఇంటిపై టీడీపీ నేతలు విసిరిన రాళ్లు, జెండాలు



టీడీపీ మూకల దాడిలో ధ్వంసమైన రేషన్ వాహనం

తిరుపతి అర్బన్ మండలంలో..

- గత నెలలో రణధీరపురం పంచాయతీ సర్పంచ్ భర్త వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణపై టీడీపీ నాయకులు విచక్షణ రహితంగా కర్రలతో దాడికి పాల్పడ్డారు. లక్ష్మీనారాయణ స్పృహ తప్పి పడిపోవడంతో చనిపోయాడనుకుని, టీడీపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సప్తగిరి నగర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ అశోక్‌కు చెందిన ఇన్నోవా కారును కర్రలు, రాడ్లతో ధ్వంసం చేశారు. అనంతరం ఇంటిపై రాళ్లతో దాడి చేసి భయానక వాతావరణాన్ని సృష్టించారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో..



ఏర్పేడు మండలం గుండ్ల కండ్రిగలో ఆర్‌బీకే భవన ప్రహరీగోడను కూల్చివేసిన దృశ్యం

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 45రోజులుగా దాడులు కొనసాగుతున్నాయి. అయితే నిలువరించాల్సిన పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

- నియోజకవర్గంలోని రేణిగుంట పట్టణంలో అక్రమ కట్టడాల పేరుతో వైఎస్సార్ సీపీ సానుభూతి పరులకు చెందిన 70 రేకు ఇళ్లను నేలమట్టం చేశారు. తద్వారా రూ.2కోట్లు నష్టం వాటిల్లింది.

శ్రీకాళహస్తి మండలంలో..

- వాగివేడులో గ్రామ వలంటీర్లు మహేశ్వరి, పృథ్వి ఇళ్లపై రాళ్లు వేసి తలుపులు ధ్వంసం చేశారు. మరో ఇంటి చుట్టూ ముళ్లకంచె వేసి, ఇంటికి ట్రాక్టర్ పనిముట్లు అడ్డంగా వేశారు.
- ఎంపేడు పంచాయతీ ఈశ్వరయ్య కాలనీలో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారన్న అక్కసుతో షికారీలపై దాడులు చేయడంతో దాదాపు 20 కుటుంబాలు గ్రామాన్ని వదిలి వెళ్లిపోయారు.
- అక్కుర్తిలో వైఎస్సార్ సీపీ కార్యకర్త రమేష్‌పై టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరిచారు.
- పోలి గ్రామంలో గ్రామ సచివాలయ భవనంపై దాడులు చేశారు. భవనంపై ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని పగులగొట్టారు.
- శ్రీకాళహస్తి పట్టణం రాజీవ్‌నగర్ సమీపంలో ఉన్న నవరత్నాల గుడిని టీడీపీ శ్రేణులు పాక్షికంగా ధ్వంసం చేశారు.
- ఏర్పేడు మండలం మిట్టమీద కండ్రిగకు చెందిన నాగేశ్వరరావు ఇంటికి తాళం వేశారు. ఇంట్లో ఉన్న అతని తల్లిని నిర్బంధించారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందడంతో వారి చొరవతో తాళాలను తీశారు.

ఏర్పేడు మండలంలో..

- ఏర్పేడు మండలం గుండ్లకండ్రిగ రైతుభరోసా కార్యాలయ భవనం ప్రహరీగోడను టీడీపీ నాయకులు కూల్చివేశారు.
- ఏర్పేడు మండలం పెనుమల్లంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు మునిరాజ వేలం పాటలో దక్కించుకున్న చెరువులో చేపలను టీడీపీ నాయకులు దౌర్జన్యంగా లూటీ చేశారు. అయితే ఈ ఘటనల్లో పోలీసులు మూడు ఘటనల్లో మాత్రమే కేసులు నమోదు చేశారు.



శ్రీకాళహస్తి: పోలి గ్రామ సచివాలయ భవనంపై దాడి చేస్తున్న టీడీపీ మూకలు

నేటితో అడ్మిషన్ల మొదటి దశ ముగింపు

తిరుపతి సిటీ: ఏపీ ఈఏఎంసెట్–2024 ఇంజినీరింగ్ అడ్మిషన్లలో భాగంగా మొదటి దశ కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా కన్వీనర్ కోటాలో సీటు పొందిన విద్యార్థులు సంబంధిత కళాశాలలో సోమవారం సాయంత్రంలోపు ప్రవేశం పొందాల్సి ఉంటుంది. మొదటి కౌన్సెలింగ్‌లో సీట్లు దక్కించుకుని అడ్మిషన్లు పొందని విద్యార్థుల సీట్లను ఖాళీలుగా పరిగణించి 23న రెండవ కౌన్సెలింగ్ ప్రక్రియకు కేటాయించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, అటానమస్ కళాశాలలకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు అందాయని అడ్మిషన్ల కమిటీ ఒక ప్రకటనలో తెలియజేసింది.

సెంట్రల్ బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్య

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. పలు ప్రాంతాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ఆర్టీసీ సర్వీసులు వచ్చిపోతుంటాయి. ఈ క్రమంలో తలెత్తే ట్రాఫిక్ కష్టాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గుర్తించారు. ఆ మేరకు శ్రీనివాస సేతు ఫ్లైఓవర్‌ను నిర్మించారు. అయితే బస్టాండ్‌లో బస్సులను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. బస్టాండ్ నుంచి ఒక బస్సు బయటకు రావడానికి 20 నుంచి 30 నిమిషాల సమయం పడుతోంది. ప్రధానంగా రాత్రి వేళల్లో ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన ఆర్టీసీ అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో సమస్య ఎక్కువగా ఉంటోంది. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి గంటలో వెళ్లిపోవచ్చని, అదే బస్సు ఎక్కితే తిరుపతి బస్టాండ్‌లోనే 30 నిమిషాలు వేచి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు.

ప్రతి దాడి చేయక తప్పదా?

- ప్రతి లెక్కకూ వడ్డీతో సహా చెల్లిస్తాం
- వైఎస్సార్‌సీపీ నేతల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: 'దాడికి ప్రతి దాడి చేయక తప్పదా.. ఎప్పుడూ లేని సంస్కృతిని చంద్రగిరికి తెస్తున్నారు.. మనం అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఐదేళ్లు ఎంతో గౌరవంగా చూసుకున్నాం.. అయినా ఇప్పుడు వాళ్లకు అధికారం రాగానే ఆడవాళ్లు అని కూడా చూడకుండా దాడులు చేసి ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు.. మనం చూస్తూ కూర్చుంటే ఈ రోజు ఒకరిని కొడితే రేపు మరొకరిపై దాడి జరుగుతుంది.. దాడికి ప్రతి దాడి చేయక తప్పదా అన్న సందేహం కలుగుతోంది.. ప్రతి లెక్కకూ వడ్డీతో సహా చెల్లిస్తాం..ప్రతి పక్షంలోనే ధైర్యంగా పోరాడాలి..'' అంటూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. తుమ్మలగుంటలోని ఆయన స్వగృహం వద్ద ఆదివారం నియోజకవర్గంలోని ఆరు మండలాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. కొత్తగా అధికారంలోకి రాగానే చంద్రగిరిలో ఎప్పుడూ లేని సంస్కృతిని తెచ్చి పల్లెల్లో రాజకీయ గొడవలు సృష్టించి అశాంతిని నెలకొల్పడానికి చూస్తున్నారని ఆరోపించారు. అధికార మదంతో పేట్రేగిపోతున్న ఈ ముష్కరులను తరిమికొట్టేందుకు పోరాటం చేయక తప్పదన్నారు. గత ప్రభుత్వంలో ఎవరికీ ఎలాంటి హానీ చేయకున్నా ఇప్పుడు పని గట్టుకుని దాడులు చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచన చేయాలన్నారు. అధికార పార్టీ ఆగడాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లడంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఎవరికి ఏ అవసరం వచ్చినా తాను అండగా నిలిచి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. అదే రీతిలో ప్రతి పంచాయతీలో ప్రతి కార్యకర్తకూ నాయకులంతా అండగా నిలబడాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆంధ్రను మరో బిహార్ చేసేశారు



ఎస్వీయూ ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం నాయకులు

తిరుపతి సిటీ: ప్రశాంత ఆంధ్రప్రదేశ్‌ను కూటమి ప్రభుత్వం మరో బిహార్‌గా మార్చేసిందని ఎస్వీయూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు మన్నెం ప్రేమ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 'ఛలో ఢిల్లీ... సేవ్ ఏపీ' అంటూ నినదిస్తూ ప్లకార్డులను ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఏపీలో నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా ఉందన్నారు. హత్యలు, అరాచకాలు, మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, అత్యాచారాలు, కక్ష సాధింపులే అజెండాగా చంద్రబాబు పాలన సాగుతోందన్నారు. తాలిబాన్ల పాలనకు మించి కూటమి నేతల దౌర్జన్యాలు రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. ప్రత్యర్థులను నడిరోడ్డుపై విచక్షణా రహితంగా వేటకొడవళ్లతో నరుకుతుంటే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చోద్యం చూస్తూ హేళనగా మాట్లాడటం దారుణమన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సైతం విమర్శించడం తగదన్నారు. అధికారం శాశ్వతం కాదనే వాస్తవాన్ని కూటమి నేతలు గ్రహించాలని హితవు పలికారు. రాష్ట్రం గత 40 రోజులుగా వల్లకాడుగా మారిందని, వెంటనే కేంద్రం జోక్యం చేసుకుని రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24వ తేదీన ఢిల్లీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాకు వర్సిటీ నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు పసుపులేటి సురేష్, ఉప సర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతి, ముని, నరేష్, దినేష్, మధు, పవన్, చరణ్, సోము, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవం.. పట్టాభిషేకం

- పట్టరాని సంతోషంతో ఐఐటీ ప్రాంగణంలో కేరింత
- అట్టహాసంగా తిరుపతి ఐఐటీ 6వ స్నాతకోత్సవం
- ఐఐటీలో ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేయడం గొప్ప అచీవ్‌మెంట్



ఏర్పేడు ఐఐటీలో ఇంజినీరింగ్ పట్టాలు అందుకున్న విద్యార్థులు

ఏర్పేడు/రేణిగుంట: 'వారంతా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులు. ప్రఖ్యాత జాతీయ విద్యాసంస్థ 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) తిరుపతి ప్రాంగణంలో దిగ్విజయంగా కోర్సును పూర్తి చేశారు.. ఏళ్ల తరబడి తాము పుస్తకాలతో కట్టిన దోస్తీ... మెదడులో కదలాడిన విభిన్న ఆలోచనలతో ఎన్నో నూతన ఆవిష్కరణలకు నాంది పలికారు.. కష్టానికి తగిన ప్రతిఫలం అందుకునేందుకు తెల్లకోటు ధరించి.. తిరుపతి ఐఐటీ లోగోతో కూడిన వస్త్రాన్ని కప్పుకుని తల్లిదండ్రులు, బంధుమిత్రుల కరతాళ ధ్వనుల మధ్య ఆచార్యుల చేతులమీదుగా అందుకున్న 'పట్టా' వారందరినీ ఆనందడోలికల్లో ముంచెత్తింది. పట్టాను అందుకుని సంబరాల్లో మునిగి తేలారు. ఆదివారం సాయంత్రం జరిగిన తిరుపతి ఐఐటీ 6వ స్నాతకోత్సవ వేడుక వారి జీవితాల్లో ఓ మరపురాని ఘట్టంగా మిగలనుంది.'

ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో ఆదివారం సాయంత్రం ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ అధ్యక్షతన 6వ స్నాతకోత్సవ వేడుక ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఆక్సిలర్ వెంచర్స్ చైర్మన్, ఇన్ఫోసిస్ కో-ఫౌండర్ క్రిస్ గోపాలకృష్ణన్, జేఎస్‌డబ్ల్యూ చైర్మన్ సజ్జన్ జిందాల్ గవర్నింగ్ బాడీ చైర్మన్‌గా వేడుకలో పాల్గొన్నారు. ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఏర్పేడు సమీపంలోని శాశ్వత ప్రాంగణంలో నడుపుతున్న ఐఐటీలోని వసతులతోపాటు కోర్సుల్లో ఉన్న విద్యార్థులు, సాధించిన విజయాలు, అధిగమించిన సవాళ్లను వివరించారు. స్నాతకోత్సవంలో విద్యార్థులతో కలిసి పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కోర్సు పూర్తి చేసుకుని బయటకు వెళ్లేవారందరూ శాస్త్ర, సాంకేతిక రంగానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి అవకాశాలను అందిపుచ్చుకుని భారతదేశ ఖ్యాతిని ప్రపంచదేశాలకు చాటి చెప్పాలన్నారు. ఉత్తమ పౌరసత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి క్రిస్ గోపాలకృష్ణన్ మాట్లాడుతూ గొప్ప ఇంజినీర్లుగా రాణించి నూతన ఆవిష్కరణలతో దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగంలో ముందువరుసలో నిలపాలన్నారు. ప్రణాళికతో కూడిన కఠోర శ్రమతోనే పోటీప్రపంచంలో రాణించగలుగుతారన్నారు. ప్రతి విద్యార్థి ఒక బ్రాండ్‌గా ఎదగాలని ఆయన కాంక్షించారు.

పతకాల ప్రదానం

తిరుపతి ఐఐటీలో అత్యధిక మార్కులు సాధించడంతోపాటు సర్వతోముఖ ప్రజ్ఞను ప్రదర్శించిన విద్యార్థులకు వివిధ అవార్డులు, మెడళ్లను ప్రదానం చేశారు. బీటెక్ విద్యార్థి అనుష్‌మంగళ్‌కు బెస్ట్ అకడమిక్ పెర్ఫామెన్స్ ఇన్ ద బీటెక్ ప్రోగ్రాం కింద స్నాతకోత్సవ సభలో ప్రెసిడెంట్ మెడల్, బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అందించి సత్కరించారు. ఆల్‌రౌండ్ ప్రొఫెషియెన్సీ ఇన్‌రికులర్, ఎక్స్‌ట్రా కరికులర్ యాక్టివిటీస్ ఇన్ బీటెక్ ప్రోగ్రాంలో అత్యుత్తమ ప్రతిభను కనబరచిన బీటెక్ విద్యార్థిని స్నేహ ఎంఎస్‌ను గవర్నర్ పతకాలను అందజేశారు. అలాగే ఆర్వీ అసోసియేట్ ప్రైజ్‌ను బీటెక్ విద్యార్థి ఆర్.విశ్వనాథ్‌కు, ఇన్‌స్టిట్యూట్ ప్రైజులను ఎంటెక్ విద్యార్థిని ఇందుకూరి నాగమహిత, బీటెక్ విద్యార్థి అనుష్ మంగళ్, ఎంటెక్ విద్యార్థిని జనపాటి వినీలాదేవి, శ్రీరాం, అభిషేక్‌గుప్తా, శ్రీగణేష శర్మ, అమరరాజ ప్రైజ్‌ను డేవిడ్‌సన్ పాల్, ఐటీసీ లిమిటెడ్ ప్రైజ్‌ను స్నేహ ఎంఎస్, శ్రీనివాసన్ నటరాజన్ అవార్డును దెబాశిష్ రోల్, ఆకురతి కుమారస్వామి, సీతారావమ్మ మెమోరియల్ ప్రైజ్‌ను ఆర్య ఏ పిళ్లైకు ప్రదానం చేశారు.

338 మందికి పట్టాలతో సత్కారం

స్నాతకోత్సవంలో ఐఐటీలో చదివిన మొత్తం 338 మంది విద్యార్థులకు ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ చేతుల మీదుగా పట్టాలను అందించి ఘనంగా సత్కరించారు. అందులో మొత్తం 210 మంది విద్యార్థులకు బీటెక్ డిగ్రీ పట్టాలు, 75మందికి ఎంటెక్ డిగ్రీ పట్టాలు, 28 మందికి ఎంఎస్సీ డిగ్రీ పట్టాలు, 16 మందికి ఎంపీపీ డిగ్రీ పట్టాలు, ముగ్గురికి ఎంఎస్(రీసెర్చ్) డిగ్రీ పట్టాలు, ఐదుగురికి పీహెచ్‌డీ డిగ్రీ పట్టాలు, ఒకరికి డిప్లొమా పట్టాను ప్రదానం చేశారు. విద్యార్థులు పట్టాలు అందుకుంటుండగా సభికులు కరతాళ ధ్వనులతో వారిని అభినందించారు.





గవర్నర్ అవార్డును అందుకుంటున్న స్నేహ, తల్లిదండ్రులతో ఇంజినీరింగ్ డిగ్రీ పట్టా అందుకున్న జి.నమితారెడ్డి

ఐఏఎస్ సాధించడమే లక్ష్యం



మాది ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా. నా తండ్రి ఆయుష్ మంగళ్ ఆగ్రా యూనివర్సిటీలో స్టాటిస్టిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. నా తల్లి పేరు శ్వేత అగర్వాల్. నేను తిరుపతి ఐఐటీలో సీటు సాధించి బీటెక్ కోర్సును పూర్తి చేశాను. బీటెక్‌లో సాధించిన అత్యుత్తమ మార్కుల ఆధారంగా నన్ను ప్రెసిడెంట్ మెడల్‌తో సత్కరించడం చాలా సంతోషకరం. ప్రస్తుతం గార్టాన్‌లో జాబ్ చేస్తున్నాను. అయితే ఐఏఎస్ సాధించడమే నా లక్ష్యం.

- అనుష్ మంగళ్, తిరుపతి ఐఐటీ ప్రెసిడెంట్ మెడల్ విజేత

స్టార్టప్‌గా ఎదగడమే లక్ష్యం



మాది బెంగళూరు. మా తల్లిదండ్రులు శ్రీనివాస్, శృతి నన్ను బాగా ప్రోత్సహించారు. తిరుపతి ఐఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో చేరాను. ఇక్కడ ప్రొఫెసర్లు ఎంతో విలువైన సమాచారాన్ని, బోధనను అందించి మా ఉన్నతికి తోడ్పడ్డారు. స్నాతకోత్సవ వేడుకలో డిగ్రీ పట్టా తీసుకోవడమే స్వప్నంగా భావించిన నన్ను ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ గవర్నర్ మెడల్‌తో సత్కరించడం గొప్ప అనుభూతి. మ్యానుఫాక్చరర్ స్టార్టప్‌గా అవతరించి భారతావని మెచ్చేటి గొప్ప ఉత్పత్తులను ప్రజలకు అందించడమే లక్ష్యం.

- స్నేహ ఎంఎస్, గవర్నర్ మెడల్ విజేత, తిరుపతి ఐఐటీ

టీడీపీ దాడిలో వస్త్ర దుకాణం ధ్వంసం

పాకాల : మండల కేంద్రంలో ఉన్న వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుల వస్త్ర దుకాణాన్ని టీడీపీ నాయకులు ఆదివారం ధ్వంసం చేశారు. బాధితుల కథనం మేరకు, సామిరెడ్డిపల్లికి చెందిన హరీష్ పట్టణంలో డీజే ఫ్యాషన్స్ వస్త్ర దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. హరీష్ భార్య లావణ్య దుకాణంలో ఉండగా టీడీపీ అల్లరి మూకలు చొరబడి సీసీ కెమెరాలు, అద్దాలు, కంప్యూటర్‌ని ధ్వంసం చేశాయి. దుకాణంలో ఉన్న బట్టలపై పెట్రోల్ పోసి అంటించడానికి ప్రయత్నించారు. ఒక ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. ఆ తరువాత దుకాణానికి తాళాలు వేసి తాళం చెవిని టీడీపీ నాయకులు తీసుకెళ్లారని బాధితురాలు కన్నీటిపర్యంతమయ్యారు. మరో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడు సేతుకుమార్‌రెడ్డి(బాబురెడ్డి) రామకృష్ణ మెడికల్స్ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఆ దుకాణానాకి తాళాలు వేసి తాళం చెవిని తీసుకెళ్లి పోయారని వాపోయారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి

వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు, మండల మాజీ యూత్ ప్రెసిడెంట్ నంగా కపిలేశ్వర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, వాసురెడ్డిపై టీడీపీ నాయకులు దాడి చేశారు. పనిపై బయటకెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా స్వగ్రామం పంటపల్లి సచివాలయం వద్ద టీడీపీ గూండాలు మూకుమ్మడిగా అతనిపై దాడి చేశారు. ఈ దాడిలో కపిలేశ్వర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. అతని వెంట ఉన్న నాయకులు ఖాదర్‌బాషా, వాసురెడ్డిపై కర్రలు, మద్యం బాటిళ్లతో దాడి చేసి గాయపరిచారు. స్థానికుల చొరవతో చికిత్స నిమిత్తం గాయపడిన వారిని తిరుపతి రుయాకు తరలించారు.

రుయాలో బాధితులకు చెవిరెడ్డి పరామర్శ



పాకాల : టీడీపీ గూండాల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు నంగా కపిలేశ్వర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, వాసురెడ్డిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం రుయా ఆస్పత్రిలో బాధితులను పరామర్శించిన ఆయన మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటానని భరోసా కల్పించారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునావృతం కాకుండా ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని గుర్తు చేశారు.

జగనన్న కాలనీలోనూ నిర్మాణాల కూల్చివేతలు





హమీద్ ఇంటి మెట్లను ధ్వంసం చేసిన దృశ్యం, ముఖేష్ ఇంటిపై టీడీపీ నాయకులు దాడి చేసి ధ్వంసం చేసిన వాటర్ ట్యాంకు

చంద్రగిరి : మండల పరిధిలోని అగరాల జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇంటిని, పక్కనే ఉన్న ఇంటిపై ట్యాంకు, పైపులను, మరో ఇంటికి చెందిన మెట్లను జేసీబీ సాయంతో కూటమి నేతలు కూల్చేశారు. సమాచారం అందుకున్న లబ్ధిదారులు పరుగున తమ ఇళ్ల వద్దకు వచ్చి బోరున విలపించారు. అప్పులు చేసి ఇళ్లను నిర్మించుకుంటుంటే టీడీపీ నేతలు ఇంత అన్యాయంగా మా ఇళ్లను కూల్చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇంటిని పూర్తిగా నిర్మించుకోలేక ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు నేలమట్టం చేయడం సమంజసమేనా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు మునుపెన్నుడూ లేని విధంగా చంద్రగిరిలో దాడులు, దౌర్జన్యాలను చూస్తున్నామని, ఇంత దారుణంగా ఘటనలు చోటు చేసుకుంటున్నా పోలీసులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటూ వాపోయారు.

గంజాయి మత్తులో టీడీపీ మూకల దాడులు

- ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు
- రుయా ఆస్పత్రికి తరలింపు



తరుణ్



తేజ

తిరుపతి క్రైమ్: తిరుపతి ఆటోనగర్లో నివాసం ఉంటున్న టీడీపీ నాయకుడు నాని, అతని అనుచరులు గంజాయి మత్తులో దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నాని, అతని అనుచరులు గంజాయి, మద్యం మత్తులో సమీపంలోని తరుణ్, తేజ అనే వ్యక్తులను దారుణంగా చితక్కొట్టారు. దీంతో వారు భయభ్రాంతులకు గురికాగా ఎందుకు కొట్టారని కేకలు వేశారు. అయినా సమాధానం చెప్పకుండా ఐదుగురితో కలిసి గాయపరిచారు. తీవ్ర రక్త గాయాలతో ఉన్న వీరిని సమీపంలోని వ్యక్తులు గమనించి 108 ద్వారా రుయా ఆసుపత్రికి తరలించారు. అయితే దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. కొట్టిన వారు టీడీపీకి చెందిన ఆటోనగర్ నాని, అతని అనుచరులుగా నిర్ధారణ అయింది. కేవలం గంజాయి మత్తులోనే వీరు దాడులకు పాల్పడినట్లుగా గాయపడిన వారు చెబుతున్నారు.

తిరుపతికి కండలేరు జలాలు

రాపూరు: తిరుపతి నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు కండలేరు జలాలను ఆదివారం నుంచి విడుదల చేస్తున్నట్లు తెలుగుగంగ ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి తెలిపారు. కండలేరు జలాశయం పంపింగ్ స్పాట్ నుంచి హిటాచీతో మట్టికట్టను తొలగించి సాయంత్రం 4 గంటలకు నీటిని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ చెన్నై, తిరుపతి మున్సిపాలిటీకి కండలేరు జలాలను విడుదల చేయవలసి ఉందన్నారు. మే 15వ తేదీ జలాశయంలో నీటి మట్టం తగ్గడంతో విడుదల నిలిపివేశామని చెప్పారు. ప్రస్తుతం తిరుపతి నగరంలో నీటి ఎద్దడి తలెత్తడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కండలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేయవలసి వచ్చిందని పేర్కొన్నారు. కండలేరు జలాశయం నుంచి నీటిని పంపింగ్ ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని దానికి సుమారు రూ.17 కోట్లు వ్యయం అవుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అయితే అంత మొత్తం ప్రభుత్వం భరించలేదని ప్రత్యామ్నాయంగా కాలువలో పూడిక తీసి నీరు విడుదల చేయవచ్చని తెలిపిందని వివరించారు. కాలువ పూడికతీతకు తిరుపతి మున్సిపాలిటీ రూ.85 లక్షలు మజూరు చేయడంతో వెంటనే నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం 30 రోజుల పాటు, రోజుకు 250 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తామని తెలిపారు. ఈ నీరు శ్రీకాళహస్తి సమీపంలోని 88 కిలోమీటర్ వద్ద ఉన్న రామాపురానికి చేరుతుందని అక్కడి నుంచి పంపింగ్ ద్వారా తిరుపతికి చేరవేయనున్నట్లు చెప్పారు. విడుదల చేస్తున్న జలాలను ఆయనతోపాటు ఈఈ విజయకుమార్‌రెడ్డి, తిరుపతి మున్సిపాలిటీ డీఈ రాజు, ఏఈలు తిరుమలయ్య, కష్టారెడ్డి, సిబ్బంది పరిశీలించారు.



కండలేరుజలాలను విడుదలను పరిశీలిస్తున్న ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి

వైభవం.. అగ్నిగుండ మహోత్సవం



అగ్నిగుండం వద్దకు ఊరేగింపుగా వస్తున్న అమ్మవారు



అగ్ని గుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

- గత ఏడాది కంటే తగ్గిన భక్తుల తాకిడి
- ఉత్సవంలో అపశ్రుతి
- గుండంలో పడి ఒకరికి గాయాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన ధర్మరాజులస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో చివరిఘట్టం అగ్నిగుండ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. సుమారు 4 వేల మంది భక్తులు కంకణధారులై అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి అగ్నిగుండం వద్దకు తీసుకువచ్చారు. అమ్మవారిని ఊరేగింపుగా తీసుకుని ఆలయం చుట్టూ మూడుమార్లు ప్రదక్షిణ చేసి సింహ వాహనంపై అధిష్టించారు. అగ్నిగుండం మహోత్సవాన్ని ప్రారంభించారు. తొమ్మిది మూలల్లో గుమ్మడికాయలు కొట్టి అగ్నిగుండంలో నిప్పులను తీసుకుని మల్లెపూల చెండులో పెట్టి అమ్మవారికి సమర్పించారు. అనువంశిక పూజారి ఆ మల్లె చెండుతో అగ్నిగుండ ప్రవేశం చేశాడు. అనంతరం పోతురాజు, గెరికి అగ్నిగుండ ప్రవేశం చేసింది. వారి వెంట భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.



అగ్నిగుండ ప్రవేశం ఆరంభిస్తున్న అర్చకులు

అగ్నిగుండంలో అపశ్రుతి

అగ్నిగుండ మహోత్సవానికి గత యేడుకంటే ఈ యేడాది భక్తుల సంఖ్య బాగా తగ్గింది. గతంలో అగ్నిగుండం తొక్కేవారి సంఖ్య 5వేలు దాటగా ఈ యేడు 4వేలుగా ఉంది. దీంతోపాటు అగ్నిగుండం అపశ్రుతి చోటుచేసుకుంది. అగ్నిగుండంలోకి ప్రవేశించే భక్తుడు అదుపుతప్పి పడిపోయాడు. స్వల్పగాయాలు కావడంతో వెంటనే ఆయన్ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఈవో ఎస్‌వీఎస్‌ఎస్ నాగేశ్వరరావు, డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ అధికారులు, ఈవో మూర్తి, డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసుల పర్యవేక్షణ ఏర్పాట్లు చేపట్టారు.